సాక్షి
నిజామాబాద్

గురువారం । 12 । డిసెంబర్ । 2024



చర్చనీయాంశమైన ఫ్లెక్సీలు

పర్యాటక రంగంపై రెడ్ టేపిజం అంటూ నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

- 8లో ▸



రెవెన్యూ, పోలీసుల పేరుతో..

ఇసుక తరలిస్తున్న వారి నుంచి దళారులు రెవెన్యూ, పోలీసుశాఖల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.5 /13.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మహిళా సంఘాల సంఖ్య పెంచాలి

- డీఆర్‌డీవో సాయాగౌడ్



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మహిళా సంఘాల సంఖ్యను పెంచాలని, కొత్త వారిని గుర్తించి గ్రూపుల్లో చేర్చాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షులతో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి కార్యక్రమాలపై చర్చించారు. మండల, గ్రామ సంఘాల ఆడిట్ గురించి వివరాలు తెలుసుకున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా ఎస్‌హెచ్‌జీలకు రుణాలు అందించి లక్ష్యాలను పూర్తి చేయాలని సాయాగౌడ్ సూచించారు. అలాగే జిల్లా సమాఖ్య నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని, జిల్లా కేంద్రంలోని నాగారంలో ఒక ఎకరం స్థలం కూడా కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో సెర్ప్ అధికారి భారతి, జిల్లా సమాఖ్య అధ్యక్షులు రాధ, డీపీఎంలు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు నిధులు మంజూరు చేయండి

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరిన వినయ్‌రెడ్డి



ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో హైడ్రాలిక్, ఫైనాన్స్ క్లియరెన్స్ అయిన ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో బుధవారం వినతి పత్రాన్ని అందజేసారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేపటి నుంచి నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: యాసంగి పంటల సాగు అవసరాల కోసం శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయనున్నట్లు నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు విడతల్లో 12 టీఎంసీల నీటిని ప్రధాన కాలువ ద్వారా విడుదల చేస్తామని పేర్కొన్నారు. నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఒలింపిక్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంజీవరెడ్డి



ఈగ సంజీవరెడ్డి



అంద్యాల లింగన్న

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం ఎన్నికల ఫలితాల్లో మాజీ పార్లమెంటు సభ్యులు జితేందర్‌రెడ్డి ప్యానల్ ఘన విజయం సాధించింది. ఇందులో జిల్లా ఒలింపిక్ సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి, రాష్ట్ర ఒలింపిక్ ఉపాధ్యక్షులుగా, సభ్యులుగా అంద్యాల లింగన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని పలువురు క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: మరమ్మతులు చేపట్టనున్న కారణంగా గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నగరంలోని ఎల్లమ్మగుట్ట, పోలీస్‌లైన్, విజయ్ టాకీస్ రోడ్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుంది.

ఇందిరమ్మ ఇంటి సర్వే షురూ..





ఇందిరమ్మ ఇంటి పథకానికి అర్హులను గుర్తించడంలో భాగంగా సర్వే ప్రారంభమైంది. తమకు ఇబ్బందులు ఎదురవుతాయని మొదట సర్వేకు నిరాకరించిన పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారులతో జరిగిన చర్చల ఫలితంగా సర్వే చేసేందుకు ముందుకొచ్చారు. ప్రత్యేక యాప్ ద్వారా కార్యదర్శులు కేవలం వివరాలను నమోదు చేస్తారు. అనంతరం గ్రామ సభలలో అర్హులను గుర్తిస్తారు. మొదటి రోజు యాప్‌లో సాంకేతిక కారణాలతో అనేక పంచాయతీల్లో సర్వే అసంపూర్తిగానే ముగిసింది.

- సర్వే నిర్వహించే కార్యదర్శులకు క్షేత్ర స్థాయిలో ఒత్తిడి
- ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారుల వెల్లడి
- యాప్‌లో తాత్కాలిక మార్పులతో సర్వేకు హామీ ఇచ్చిన ఉన్నతాధికారులు
- రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులతో ఫలించిన కార్యదర్శుల చర్చలు
- మొదటి రోజు అసంపూర్తిగా సర్వే



మెండోరాలో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి, పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు


మోర్తాడ్(బాల్కొండ): ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించడానికి అర్హులను గుర్తించే సర్వే జిల్లాలో బుధవారం ప్రారంభమైంది. ప్రత్యేక యాప్ ద్వారా సర్వే, అన్నింటికీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉండటంతో ఈ సర్వే నిర్వహించడం తమకు ఇబ్బంది అని మొదట్లో పంచాయతీల ఉద్యోగులు తేల్చిచెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఈ సర్వేను తాము నిర్వహించబోమని కార్యదర్శుల సంఘం ఉన్నతాధికారులకు విన్నవించింది. సోమవారం సర్వే ఆరంభించాల్సి ఉండగా అదే రోజు జిల్లా, మండల కేంద్రాల్లో సర్వే నుంచి తమను తప్పించాలని కార్యదర్శులు అధికారులకు వినతి పత్రాలు అందించారు. మంగళవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో కార్యదర్శుల సంఘం చర్చలను జరిపింది. సర్వేలో మార్పులు చేర్పులు చేయడానికి ప్రభుత్వం నుంచి సానుకూలత రావడంతో సర్వేలో పాల్గొనడానికి కార్యదర్శులు అంగీకరించారు.

గ్రామ సభల ద్వారానే అర్హుల గుర్తింపు

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం సాయం అందుకునేవారు అర్హులా.. కాదా అనే విషయం గతంలో యాప్ ద్వారా తేల్చాల్సి ఉండేది. యాప్‌ను నిర్వహించేది కార్యదర్శులే కావడంతో ఎవరికైనా పథకం లబ్ధి చేకూరకపోతే తమకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతాయని కార్యదర్శులు స్పష్టం చేశారు. యాప్ ద్వారా కేవలం వివరాలను నమోదు చేసి గ్రామ సభల నిర్వహణలో అర్హులను గుర్తించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే కార్యదర్శులు సెలవు దినాల్లో కాకుండా పని రోజులలోనే సర్వే నిర్వహించడానికి ఉన్నతాధికారులు సానుకూలత వ్యక్తం చేశారు. సర్వే పూర్తి చేయడానికి నిర్దిష్టమైన సమయం అంటూ లేకపోవడంతో కార్యదర్శులకు ఊరట లభించింది. ఇది ఇలా ఉండగా ఒక్కో పంచాయతీకి ఒక్కటే యూజర్ ఐడీ ఉండటంతో భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన చోట సర్వేకు ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉంది.

సరిగా పని చేయని యాప్..

సర్వే ఆరంభించిన మొదటి రోజు అనేక చోట్ల ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు నిర్దేశించిన యాప్ సరిగా పని చేయలేదు. సాంకేతిక కారణాలతో అనేక పంచాయతీల్లో సర్వే అసంపూర్తిగానే ముగిసింది. యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఒక్కో చోట ఒకటి రెండు దరఖాస్తులనే పరిశీలించారు. యాప్ ఇన్‌స్టాల్ చేయడం.. వెంటనే సర్వే నిలిచిపోవడం, ఒకే రోజున అంతటా యాప్‌ను వినియోగించడంతో సాంకేతిక సమస్యలు తలెత్తి ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. గురువారం నుంచి సర్వే సాఫీగా సాగే అవకాశం ఉందని అధికార యంత్రాంగం వెల్లడించింది.



ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్

సర్వే ప్రారంభించాం..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ఆర్థిక సాయం అందించడానికి నిర్దేశించిన యాప్‌తో సర్వే ప్రారంభించాం. కార్యదర్శుల మొబైల్ ఫోన్‌లలో యాప్ ఇన్‌స్టాల్ చేయాల్సి ఉండగా, సర్వే లాంఛనంగా ఆరంభమైంది. ఒక్కో దరఖాస్తుకు సంబంధించి సర్వే పూర్తి చేయడానికి తక్కువ సమయం పడుతుంది.

– తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

నెలాఖరులోగా సర్వే పూర్తి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా అధికారులు

- జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దిశానిర్దేశం

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి క్షేత్రస్థాయి సర్వేను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ శాంతికుమారి, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం తదితరులతో కలిసి మంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, గ్రూప్–2 పరీక్షల నిర్వహణ, సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం చేపట్టిన ఇంటింటి సర్వే, హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీల పెంపు అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను ఏ ఒక్క దరఖాస్తుదారుడిని మినహాయించకుండా ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో జరపాలన్నారు. 500 మంది దరఖాస్తుదారులకు ఒక సర్వేయర్, ఐదుగురు సర్వేయర్లకు ఒక సూపర్వైజర్ ను నియమించాలన్నారు. మొబైల్ యాప్ వినియోగం, ప్రభుత్వ మార్గదర్శకాలపై పరిపూర్ణమైన అవగాహన కోసం జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇప్పించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ నెల 13,14 తేదీలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఒక్కో సర్వేయర్ రోజుకు కనీసం 25 ఇళ్లను సందర్శించి గడువులోపు సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వేకు వెళ్లేముందు కనీసం ఒకరోజు ముందు దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ప్రజల సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ ను అందుబాటులో ఉంచాలన్నారు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమంపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వం పిల్లలకు అందించే డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, విద్యా సంస్థలను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3.20 లక్షల కుటుంబాలు దరఖాస్తులు చేసుకున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇప్పటికే 680 మంది సర్వేయర్లను ఏర్పాటు చేసి 5,800 కుటుంబాల వివరాలను సర్వే ద్వారా సేకరించామన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్, ఆర్మూర్ మున్సిపాలిటీలో ఒక వార్డులో సర్వే చేశామన్నారు. కాగా, మొబైల్ యాప్‌లో ఫొటోలను పీడీఎఫ్ మోడ్‌లో అప్లోడ్ చేయడానికి ఎక్కువ సమయం పడుతున్నందున, దానిని జేపీఈజీ మోడ్‌లో మార్చితే బాగుంటుందని కలెక్టర్ పేర్కొనగా, యాప్ అప్లికేషన్లో మార్పులు చేయిస్తామని మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించారు.



వీసీలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

గ్రూప్ -2 పరీక్షల నిర్వహణపై సమీక్ష

గ్రూప్ -2 పరీక్షల నిర్వహణపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ.. ఈసారి అభ్యర్థులకు ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్ అందించనున్నట్లు తెలిపారు. పాటించాల్సిన నియమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి అభ్యర్థికి ఓఎంఆర్ షీట్ ప్రత్యేకంగా ఉన్నందున పరీక్ష హాల్‌లో అభ్యర్థి రాకపోయినా అతని స్థానంలో ఓఎంఆర్ షీట్ ప్రశ్నపత్రం అలాగే పెట్టాలని, ఒకరి ఓఎంఆర్ షీట్ మరొకరికి ఇవ్వడానికి వీలు లేదన్నారు. జిల్లాలో మొత్తం 19854 మంది అభ్యర్థులు గ్రూప్–2 పరీక్షకు హాజరు కానున్నారని, 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ హనుమంతు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- సాలూర క్యాంప్ వద్ద ప్రమాదం



ఘటనా స్థలంలో షేక్ మహబూబ్ మృత దేహం

బోధన్ రూరల్ : సాలూర మండలం సాలూర క్యాంప్ గ్రామ సమీపంలో బుధవారం కారు అతివేగంతో రెండు బైక్‌లను ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ పట్టణానికి చెందిన షేక్ దావుద్ కారులో కుటుంబంతో కలిసి మహారాష్ట్రకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాలూర క్యాంప్ శివారులో బైక్‌పై వెళ్తున్న బోధన్ మండలం భూలక్ష్మీ క్యాంప్ గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డిని దావూద్ కారు వేగంగా ఢీకొట్టింది. మహేందర్ రెడ్డి కింద పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ను ఢీకొట్టిన అనంతరం ర్యాంగ్ రూట్‌లోకి మళ్లిన కారు అదే సమయంలో ఎదురుగా వస్తున్న మహారాష్ట్రలోని దౌలపూర్‌కు చెందిన మహబూబ్, రషీద్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడిపిస్తున్న షేక్ మహబూబ్ (42) అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున రషీద్ కు తీవ్ర గాయాలయ్యాయి. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్పీడీతో సమగ్ర శిక్ష ఉద్యోగుల చర్చలు విఫలం

- రెండు రోజుల్లో కేజీబీవీ, భవిత కేంద్రాలకు తాళాలు!
- సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్న అధికారులు
- మరింత ఉధృతం చేస్తామంటున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు



హైదరాబాద్‌లో ఉద్యోగులతో చర్చలు జరుపుతున్న స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్

ఆర్మూర్: విద్యా శాఖలో విలీనం చేసి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో సమ్మె బాట పట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులతో రాష్ట్ర స్థాయి అధికారుల చర్చలు విఫలమయ్యాయి. డీఈవో, ఎంఈవో కార్యాలయాలతోపాటు కేజీబీవీలు, భవిత కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తమ విధులను బహిష్కరించి ఐదు రోజులుగా సమ్మెలో ఉన్నారు. తాజాగా స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) ఈవీ నర్సింహారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ లింగయ్య, ఏఎస్‌పీడీ రాధారెడ్డి, జేడీ రాజీవ్‌తో మంగళవారం రాత్రి జరిపిన చర్చలు విఫలం కావడంతో పూర్తి స్థాయిలో ఉద్యోగులు సమ్మె బాట పట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరో రెండు రోజుల వరకు తమకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన రాతపూర్వక హామీ రాని పక్షంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)కు, భవిత కేంద్రాలకు పూర్తిస్థాయిలో తాళాలు వేసి బోధన, బోధనేతర సిబ్బంది తమ విధులను బహిష్కరించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగి జిల్లాలోని 27 కేజీబీవీలు మూత పడితే ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 6,920 మంది బాలికల చదువు ఆగమ్యగోచరంగా మారనుంది. అదేవిధంగా జిల్లాలోని 27 భవిత కేంద్రాల్లో సేవలు పొందుతున్న సుమారు 300 మంది దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి.

కఠిన చర్యలు తప్పవంటూ..

సమ్మెబాట పట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల వివరాలను అధికారులు ఫోన్‌లు చేసి తెలుసుకుంటున్నారు. రాష్ట్ర స్థాయి అధికారుల మౌఖిక ఆదేశాల మేరకు సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగుల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నారు. సమ్మెను విరమించి విధుల్లో చేరని పక్షంలో కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరికలు సైతం చేస్తున్నారు. మరోవైపు ఉద్యోగులు తమ ఉద్యోగాలను ఫణంగా పెట్టి నిరసన దీక్షలకు తీవ్రతరం చేస్తున్నారు.

పర్యాటక అభివృద్ధి అయ్యేనా..!

- గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు
- ఇప్పటికీ నిధులు మంజూరు కాని వైనం
- ఎకో టూరిజం పేరుతో కాలయాపన
- తాజాగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో పర్యాటకుల్లో ఆశాభావం



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పర్యాటకంగా అభివృద్ధి చెందేనా అని పర్యాటకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ వద్ద టూరిజం డెవలప్‌మెంట్ కోసం చర్యలు తీసుకుంటామని వారం రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ. 50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడ మంజూరు కాలేదు.

కలగానే మిగులుతున్న వైనం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పర్యాటకంగా అభివృద్ధి చెందడం అనేది ఏళ్లుగా కలగానే మిగులుతోంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనూ ప్రభుత్వాలు ఎస్సారెస్పీని పట్టించుకోలేదు. అయితే చివరి దశలో ఆరు కోట్ల నిధులతో ప్రాజెక్ట్ దిగువన పార్కును ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నాయి. తరువాత ప్రత్యేక రాష్ట్రంలో పర్యాటకంగా అడుగులు వేయలేదు.

నాలుగేళ్లుగా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటు చేస్తామని నాలుగేళ్లుగా టూరిజం శాఖ ఊరిస్తోంది. ఇరిగేషన్ అధికారుల నుంచి స్థలాల అప్పగింత పూర్తయింది. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి టూరిజం అధికారులు బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ సమయంలో అప్పటి టూరిజం ఎండీ మనోహర్ ఇంత అద్భుతమైన స్థలం తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడ లేదని కితాబు ఇచ్చాడు. దీంతో పర్యాటక కేంద్రంగా ఎస్సారెస్పీ అభివద్ధి చెందుతుందని పర్యాటకులు ఆనందపడ్డారు. ఐదేళ్లు గడిచినా పరిస్థితి మాత్రం అంతే ఉంది.

మల్లన్న గుట్టకు రోప్‌వే..

బస్సాపూర్ శివారులో పర్యాటక కేంద్రం ఏర్పడితే అక్కడి నుంచి ఎస్సారెస్పీ రిజర్వాయర్‌లో కిలోమీటర్ దూరంలో ఉన్న మల్లన్న గుట్ట వరకు రోప్‌వే వేయాలని టూరిజం అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో బస్సాపూర్ శివారు నుంచి మల్లన్న గుట్ట వరకు రోప్‌వే వేయాలని డిమాండ్ పెరిగింది. ఎస్సారెస్పీలో ముంపునకు గురైన రత్నాపూర్ గ్రామవాసుల ఆరాధ్య దైవం మల్లన్న ఆలయం. మల్లన్న గుట్ట సుమారు రెండెకరాల విస్తీర్ణంతో ఉంటుంది.

సీజన్‌లో వేల సంఖ్యలో..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి దిగువకు గోదావరిలోకి విడుదల చేపట్టినప్పుడు ప్రాజెక్ట్ సందర్శనకు పర్యాటకులు వేల సంఖ్యలో తరలి వస్తుంటారు. దీంతో ప్రాజెక్ట్ జనకళను సంతరించుకుంటుంది. తర్వాత ఏడాది పొడువునా పర్యాటకుల తాకిడి సుమారుగా ఉంటుంది. ప్రాజెక్ట్ డ్యాం నుంచి బస్సాపూర్ 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పాలకులు స్పందించి ఎస్సారెస్పీని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పర్యాటకులు డిమాండ్ చేస్తున్నారు.

బాసర వరకు బోటు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి చదువుల తల్లి సరస్వతి మాత కొలువు దీరిన బాసర వరకు గోదావరిలో బోటు సౌకర్యం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. గతంలో బాసర నుంచి ఎస్సారెస్పీ వరకు బోటులో ట్రయల్‌రన్ కూడా నిర్వహించారు. బస్సాపూర్ శివారు నుంచి బాసర వరకు 60 కిలోమీటర్ల దూరం ఉంటుంది. బోటులో ట్రయల్ రన్‌లో రెండున్నర గంటల్లో బాసర నుంచి ఎస్సారెస్పీకి చేరుకున్నారు. గోదావరిలో మార్గ మధ్యలో నందిపేట్ మండలం కుస్తాపూర్ రామలింగేశ్వర స్వామి ఆలయం, నవీపేట్ తుంగిని హనుమాన్ ఆలయాన్ని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే గోదావరిలో విహరిస్తూ సరస్వతి మాతను రెండున్నర గంటల్లో దర్శించుకోవచ్చు.

క్లుప్తంగా

కమిషనరేట్ పరిధిలో నలుగురు ఎస్సైల బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్సైలు బుధవారం బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో కొంత మంది ఎస్సైలపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. మల్టీజోన్–2 పరిధిలో మొత్తం 24 మంది ఎస్సైలను బదిలీలు చేస్తూ డీఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జిల్లాకు చెందిన ఎస్సైలు ఉన్నారు. వేల్పూర్ ఎస్సై నాగనాథ్, ఆదిలాబాద్ వీఆర్‌కు, సిలివేరి మహేశ్ ఆదిలాబాద్ వీఆర్ నుంచి ఆర్మూర్–1 ఎస్సైగా, ఆర్మూర్–1 ఎస్సై గోవింద్‌ను నిజామాబాద్ కమిషనరేట్ బదిలీ చేసినప్పటికీ తిరిగి ఆర్మూర్‌కు అటాచ్ ఇచ్చారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి–1 ఎస్సై చిరంజీవి నందిపేట్‌కు బదిలీ అయ్యారు. నందిపేట్ ఎస్సైగా ఉన్న హరిబాబు ఆదిలాబాద్ వీఆర్‌కు వెళ్లారు. నిజామాబాద్ సీసీఎస్ ఎస్సై ఎండీ మాలిక్ రహమాన్‌ను భైంసారూరల్ ఎస్సైగా బదిలీ చేశారు.

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎంలో స్పాట్ అడ్మిషన్లు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో లా కాలేజీ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 17న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ కే సంపత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్‌లోని లా కాలేజీ సెమినార్‌లో ఈ నెల 17న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు టీజీ లాసెట్–2024 /టీజీ పీజీ లాసెట్–2024 ఎంట్రెన్స్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు స్టేట్ ర్యాంకు మెరిట్ ఆధారంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుందని, తక్షణ ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ వసతి ఉండదని స్పష్టం చేశారు. ఎల్ఎల్‌బీలో 14 సీట్లు, ఎల్ఎల్ఎంలో ఒక సీటు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సంప్రదించాలని సూచించారు.

గోమాతను రాష్ట్రమాతగా ప్రకటించాలి



నిజామాబాద్‌నాగారం: గోమాతను రాష్ట్రమాతగా ప్రకటించాలని అఖిల భారత గోసేవ ఫౌండేషన్ సమన్వయకర్త మరాట సంతోష్‌కుమార్, గోసేవ సమితి అధ్యక్షుడు వీరమల్లి రమేశ్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని కోరుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు నీల కంఠేశ్వర ఆలయం నుంచి గాంధీచౌక్ వరకు పాదయాత్ర ఉంటుందని, నాలుగు గంటలకు గంగాస్థాన్–2లోని ఉత్తర తిరుపతి క్షేత్రంలో మహాసభ ఉంటుందని అన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలో రెండు రోజుల పాటు జరుగుతున్న శాసన సభ, శాసన మండలి సభ్యుల శిక్షణ తరగతుల్లో బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. సహచర శాసన సభ్యులు, ఎమ్మెల్సీలతో కలిసి శిక్షణ తరగతులకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

రెవెన్యూ, పోలీసుశాఖల పేరుతో వసూళ్లు

- సుంకెట్ వాగు నుంచి జోరుగా ఇసుక తరలింపు
- వసూళ్లకు పాల్పడుతున్న దళారులు
- ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.500 చొప్పన వసూలు
- ఉచిత ఇసుక విధానానికి గండికొడుతున్న అక్రమార్కులు



సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

మోర్తాడ్: మోర్తాడ్ మండలం సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుక తరలించే సందర్భంలో దళారులు భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ శాఖ పేరుతో రూ.300, పోలీసు శాఖ పేరుతో రూ.200 చొప్పున మామూళ్లను ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు ఇవ్వాలని వసూళ్లకు తెరలేపారు. దళారులు అధికారుల పేరు చెప్పి ఒక్కో ట్రిప్పుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నా ఆ రెండు శాఖల అధికారులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. ఇళ్ల నిర్మాణదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుండగా, దళారులు అధికారులకు వాటాల పేరిట వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం. అక్రమార్కుల కారణంగా ఉచిత ఇసుక విధానం మామూళ్ల మయమైంది. సుంకెట్ వాగు నుంచి జిల్లాలో ఎక్కడికైనా ఇసుకను తరలించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చినప్పటికీ అధికారులకు వాటాలు అంటూ ప్రతి ట్రిప్పుకు రూ.500 చొప్పున కొందరు దళారులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇసుక పాయింట్ కొనసాగిన రోజున కనీసం 500 ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. ఆ లెక్కన ఒక్కో రోజు అధికారుల పేరుతో వసూలు చేసే మొత్తం రూ.2.50లక్షలు అని తెలుస్తోంది.

అధికారుల పాత్ర నామమాత్రమేనా?

సుంకెట్ పెద్దవాగు నుంచి గతంలో ప్రతి బుధ, శుక్రవారాల్లో ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇచ్చేవారు. కొన్ని నెలలుగా వ్యాపారుల గుప్పిట్లో ఇసుక పాయింట్ ఉండటంతో అధికారుల పాత్ర నామమాత్రమైందనే విమర్శలున్నాయి. తమకు అనుకూలమైన రోజున పాయింట్‌ను నిర్వహించేలా వ్యాపారులు సూచించిస్తుండగా, అధికారులు అదే పాటిస్తున్నారని తెలుస్తోంది.

ఇలా చేస్తే అక్రమాలకు చెక్..

సుంకెట్‌కు చెందిన కొందరు వ్యాపారులే ఇసుకను తరలించేందుకు అధికారుల నుంచి అనుమతి పత్రాలను పొందుతున్నారు. ఇళ్లు నిర్మించుకునే వారు ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్తే వారికి ఇసుక తవ్వుకోవడానికి అవకాశం ఇవ్వడం లేదు. అధికారులు పారదర్శకంగా వ్యవహరించి వ్యాపారుల జోక్యాన్ని నివారిస్తే అక్రమ వసూళ్లకు అవకాశం ఉండదనే వాదన వినిపిస్తోంది.

లక్కోర కేంద్రంగా..



లక్కోరకు చేరిన సుంకెట్ పెద్దవాగు నుంచి చిట్టాపూర్‌కు కేటాయించిన ఇసుక ట్రాక్టర్



చిట్టాపూర్ పేరుపై పంపిన ట్రాక్టరు వేబిల్లు

వేల్పూర్: మండలంలోని లక్కోర కేంద్రంగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సుంకెట్ పెద్దవాగు నుంచి ఇతర గ్రామాలకు అనుమతుల పేరిట కేటాయించిన ఇసుకను దారి మళ్లించి లక్కోరలో నిల్వ చేస్తున్నారని అంటున్నారు. పెద్దవాగు వాగు నుంచి తెచ్చిన ఇసుకను లక్కోర వద్ద డంపు చేసి, రాత్రిపూట అమ్ముకుంటున్నారని ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారిపై లక్కోర ఉండడం, రాత్రిపూట ఇతర గ్రామాలకు సులువుగా తరలించడానికి అనువుగా ఉండడంతో వ్యాపారులు తమ అక్రమ ఇసుక దందాను నిరాటంకంగా కొనసాగస్తున్నారని వాపోతున్నారు. మండలంలో వేల్పూర్, వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్, పచ్చలనడ్కుడ, కొత్తపల్లి ఎస్ గ్రామాలకు పెద్దవాగు సరిహద్దుగా ఉంది. రామన్నపేట్, మోతె, అక్లూర్ గ్రామాల వెంట కప్పల వాగు ప్రవహిస్తుంది. గతంలో ప్రభుత్వం కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాల వద్ద ఇసుక తరలింపుకు అనుమతులు ఇచ్చింది. వేల్పూర్ మండలంలో ఇసుక రవాణాకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చి, సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నకిలీ నోట్ల కలకలం

- టాస్క్‌ఫోర్స్ అదుపులో బిచ్కుందకు చెందిన వ్యక్తి ?

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యాపార కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి మూడు రోజుల క్రితం సుమారు రూ.20లక్షల నుంచి రూ.29లక్షల వరకు నకిలీ నోట్లను కారులో తరలిస్తుండగా బాన్సువాడ సర్కిల్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి మూడు రోజులుగా కనిపించడం లేదని, పోలీసులు అదుపులో ఉన్నప్పటికీ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారని మండల కేంద్రవాసులు చర్చించుకుంటున్నారు. నకిలీ నోట్లు ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారా? ముఠాలో ఎవరెవరు ఉన్నారనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నట్లు తెలిసింది. సదరు వ్యక్తితో పరిచయం ఉన్న వారు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు తమను విచారిస్తారనే భయంతో కొందరు బిచ్కుంద నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. నకిలీ నోట్లకు సంబంధించి వివరాలు త్వరలోనే బయటకు వచ్చే అవకాశాలున్నాయి.

నేడు బ్యాంక్ రుణాలపై సమావేశం

నిజామాబాద్ సిటీ: నగరంలోని బ్యాంకర్లతో మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేశ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం బ్యాంక్ లోన్‌ల ఎంపికపై చర్చించనున్నారు. ఇందిరా మహిళా శక్తి గ్రూపు రుణాలు, వీధి విక్రయదారులు, వీధి వ్యాపారుల రుణాలు, బ్యాంక్ లింకేజీల రుణాలు, మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలు, పీఎం స్వానిధి వంటి పలు రుణాల మంజూరుపై బ్యాంక్ అధికారులతో ఎల్‌డీఎం, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌తోపాటు మెప్మా సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొననున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కస్తూర్బా స్టోర్ రూంను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్‌కుమార్

జక్రాన్‌పల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ అంకిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన కిచెన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో ప్రత్యామ్నాయంగా వేరే వారిని ఏర్పాటు చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్ అదనపు కలెక్టర్‌కు తెలిపారు. పాఠశాలల్లో కిచెన్, స్టోర్‌రూములు, తాగునీటి సరఫరా, హాస్టళ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సతీశ్‌కుమార్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, ఎంఈవో శ్రీనివాస్ తదితరులున్నారు.

బాల్య వివాహం అడ్డగింత

బాన్సువాడ : బీర్కూర్ మండలంలోని చించోలి గ్రామంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. మండలంలోని నస్రుల్లాబాద్ మండలానికి చెందిన ఓ బాలికను చించోలికి చెందిన యువకుడికి పెళ్లి చేస్తున్నారనే సమాచారం మేరకు ఐసీడీఎస్ అధికారులు పోలీసులతో కలిసి గ్రామానికి చేరుకుని అడ్డుకున్నారు. బాల్య వివాహం కారణంగా తలెత్తే దుష్పరిణామాలపై ఇతరుకుటుంబాలకు అవగాహన కల్పించారు. పెళ్లి చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడీపీవో సౌభాగ్య, సూపర్‌వైజర్ సుమలత, మీన తదితరులున్నారు.

చర్చనీయాంశమైన ఫ్లెక్సీలు



నిజామాబాద్‌అర్బన్: 'పర్యాటక రంగంపై రెడ్ టేపిజం..'అంటూ జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.మంగళవారం రాత్రి నగరంలోని పలు కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జిల్లాలో కొందరు అధికారులు కబంధహస్తాల్లో పర్యాటకరంగం.. అంటూ ఫ్లెక్సీలో పేర్కొన్నారు. జిల్లాలో చెప్పుకోదగిన స్థాయిలో టూరిజం అందుబాటులో లేదు. ప్రభుత్వ సంబంధిత శాఖలు కూడా టూరిజానికి సంబంధించి పెద్దగా ప్రచారం కానీ అభివృద్ధి చేస్తున్న దాఖలాలు లేవు. కానీ టూరిజం కబంధహస్తాల్లోకి వెళ్లిందంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై సర్వత్రా చర్చ జరుగుతోంది.తమ సొంత ప్రయోజనాల కోసం అధికారులను బ్లాక్ మెయిల్ చేసేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారా? అనే కోణంలో చర్చ జరుగుతోంది. పాత కలెక్టరేట్ చౌరస్తా,ధర్నా చౌక్,ఎన్టీఆర్ చౌరస్తా, కంఠేశ్వర్ ప్రధాన కూడళ్లలో ఈ ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. అంతగా ప్రాధాన్యత లేని టూరిజంపై నగర ప్రజలను చర్చించుకునేలా చేయడం వెనుక ఎవరి హస్తం ఉందో తెలియాల్సి ఉంది. దీనిపై పోలీసులు రహస్య విచారణ చేపడుతున్నారు.

వర్సిటీ ఇంటర్ కాలేజ్ టోర్నీ ప్రారంభం



వర్సిటీలో అథ్లెటిక్స్ పోటీలు..



బేస్ బాల్ జిల్లా జట్టు క్రీడాకారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించినట్లు స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్ తెలిపారు.

టోర్నీలో వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఒరిస్సాలోని కీస్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని బాలకిషన్ తెలిపారు. టోర్నమెంట్‌లో ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీఆర్ నేత, ఫిజికల్ డైరెక్టర్లు బాలమణి, రమ, రూప, అనిల్ కుమార్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో నిలపాలి..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల క్రీడమైదానంలో జిల్లా సీనియర్ పురుషుల బేస్ బాల్ జట్టు ఎంపికను బుధవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడకారులు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రబేస్ బాల్ పురుషుల చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవ్, కోచ్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు మృతి

మురికి కాలువలో పడి ..

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటగల్లీకి చెందిన శ్రీరామ లక్ష్మణ్(50) అనే వ్యక్తి మురికి కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రతిరోజూ మద్యం తాగే అలవాటు ఉన్న లక్ష్మణ్ కొన్ని సందర్భాల్లో ఇంటికి వెళ్లేవాడు కాదన్నారు. బుధవారం ఉదయం నగరంలోని చంద్రానగర్ కాలనీ శ్మశాన వాటిక వద్ద మురికికాలువలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మద్యం సేవించి భార్యను ఇబ్బందులకు గురి చేయడంతో భార్య 25 ఏళ్ల క్రితం లక్ష్మణ్‌ను వదిలి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి తల్లివద్దే ఉంటున్నాడన్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సౌదీలో కామారెడ్డి వాసి ..



అబ్దుల్ సలీం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని సైలానీబాబా కాలనీకి చెందిన అబ్దుల్ సలీం (41) గుండెపోటుతో సౌదీలో మృతి చెందినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్థిక ఇబ్బందులకు తోడు ఉపాధి లేకపోవడంతో బతుకుదెరువు కోసం ఈ నెల 6న సలీం సౌదీ అరేబియాలోని జెద్దాకు వెళ్లాడు. సోమవారం డ్యూటీ నుంచి రూమ్‌కు వెళ్లిన తర్వాత గుండెపోటు రావడంతో అక్కడి వారు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సలీం మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని కామారెడ్డికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మృతుని బంధువులు తెలిపారు.

గోదావరిలో దూకి ఆత్మహత్య

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని గోదావరి పుష్కర ఘాట్ సమీపంలోని నదిలో జిల్లా కేంద్రానికి చెందిన ఉల్లెందుల రాజు(40) దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రాజు గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. పనికి వెళ్తున్నాను అని చెప్పి గత నెల 29న ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారన్నారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సైబర్ మోసం

ఎడపల్లి(బోధన్):మండలంలోని ఠాణాకలాన్‌కు చెందిన ఓ యువకుడు క్రెడిట్‌కార్డు డీఆక్టివేట్ చేసేందుకు ఓ లింక్‌ను ఓపెన్ చేసి రూ.28వేలు మోసపోయాడని ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపారు. బాధిత యువకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. సైబర్ నేరగాళ్లు పంపించే ఎలాంటి లింక్‌లు ఓపెన్ చేయొద్దని, బ్యాంక్ వ్యవహారాలు ఉంటే సంబంధిత బ్యాంక్‌కు వెళ్లాలని మండల ప్రజలకు సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



నవీపేట: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఎదుట చోటుచేసుకున్న ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు పెద్ద సాయిలు(61) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. కళ్యాపూర్ గ్రామానికి చెందిన గుట్టమీది పెద్ద సాయిలు ఈనెల 5న నవీపేట నుంచి కళ్యాపూర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి బస్సును ఢీకొట్టాడన్నారు. గాయాలపాలైన సాయిలును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ బుధవారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన తరువాత సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచామన్నారు. మెజిస్ట్రేట్ నూర్ జహాన్ బేగం 30 మందికి రూ.59,200 జరిమానా విధించారని అలాగే ఆర్మూర్‌కు చెందిన కోయల్కర్ శ్రీనివాస్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

అక్బర్‌నగర్‌కు చెందిన వ్యక్తికి..

రుద్రూర్: మండలంలోని అక్బర్ నగర్ గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్సై సాయన్న తెలిపారు. సదరు వ్యక్తిని బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రెండు రోజుల జైలుశిక్ష విధించిందన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

రుద్రూర్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలానికి చెందిన ఇద్దరు రౌడీ షీటర్లను బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సాయిలు, గంగాసాగర్‌ను సత్ప్రవర్తనలతో మెలగాలని ముందు జాగ్రత్త చర్యగా తహసీల్దార్‌ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో దొంగల హల్‌చల్



చోరీ జరిగిన ధోంది మెడికల్



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దుండగుల కదలికలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున మూడు దుకాణాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం వెళ్లగానే టాటా ఏస్‌లో వచ్చిన ఐదుగురు దుండగులు ధోండిడి మెడికల్ షట్టర్‌ను ధ్వంసం చేసి రూ.3లక్షల నగదు, అలాగే కేర్ మెడికల్‌లో నుంచి రూ.30వేలు, సమీపంలోని ఓ స్కానింగ్ సెంటర్ నుంచి సుమారు రూ.30వేల నగదు, టీవీని ఎత్తుకెళ్లారు. దుండగుల కదలికలు సీసీ ఫుటేజీలో పరిశీలించామని, వారు వాడిన వాహనం మహారాష్ట్రలో రిజిస్ట్రేషన్ అయ్యిందని పోలీసులు తెలిపారు. దొంగలు అక్కడివారే కావొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దుకాణాలను ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, క్లూస్ టీం బృందం పరిశీలించి ఆధారాలు సేకరించారు. రెండు పోలీసు బృందాలు దర్యాప్తు ప్రారంభించాయని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన కట్ట మానస, ఆమె భర్త రాజశేఖర్ తమ బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగివచ్చే సరికి దుండగులు ఇంట్లో చొరబడ్డారు. రాజశేఖర్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ చిక్కలేదు. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మానసతోపాటు ఆమె భర్త రాజశేఖర్ బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లి మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటకు తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో మానస అనుమానంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ముగ్గురు దుండగులు కనిపించారు. ఆమె కేకలు వేయడంతో అప్రమత్తమైన రాజశేఖర్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ వారు పరారయ్యారు. దుండగులు తమ ఇంట్లో నుంచి రూ.లక్షా పది వేల నగదుతోపాటు రెండు బంగారం ఉంగరాలు ఎత్తుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బోధన్‌లో అల్ప్రాజోలం పట్టివేత

- 4.330 కిలోల నిషేధిత మత్తు పదార్థం స్వాధీనం
- పట్టుబడిన అల్ప్రాజోలం విలువ రూ.43 లక్షలు



వివరాలు వెల్లడిస్తున్న స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు

బోధన్‌టౌన్(బోధన్):మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హైమద్‌నగర్ నుంచి బాన్సువాడ – వర్ని మీదుగా మారుతి సుజికి వాహనంలో తరలిస్తున్న 4 కిలోల 330 గ్రాములు అల్ప్రాజోలంను స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. నిందితులను విచారించి బోధన్‌లోని ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి తరలించారు.అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర సూపరింటెండెంట్ ప్రదీప్‌రావ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే రాష్ట్ర ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హైమద్‌నగర్ నుంచి సిద్దిపేట్ ప్రాంతానికి చెందిన నర్సింలుగౌడ్, నవీన్‌గౌడ్, నాందెడ్‌కు చెందిన యాదగిరి బాన్సువాడ–వర్ని మీదుగా పెద్ద మొత్తంలో అల్ప్రాజోలం తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రెండు బృందాలుగా ఏర్పడి పట్టుకున్నామన్నారు.పట్టుబడిన అల్ప్రాజోలం విలువ సుమారు రూ.43 లక్షలు ఉంటుందని తెలిపారు. మరో బృందం ఇప్పటికీ తనిఖీలు చేపడుతోందని వెల్లడించారు. సమావేశంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్లు స్వప్న, వెంకటేశ్వర్లు, సీఐ పవన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని నేరల్‌తండాలో ఎండు గంజాయి విక్రయిస్తున్న మహిళతో పాటు మరో యువకుడిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నేరల్‌తండాకు చెందిన బామన్ సజ్జు అనే మహిళ తన ఇంట్లోనే ఎండు గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తోందనే పక్కా సమాచారం మేరకు రెక్కీ నిర్వహించి పట్టుకున్నామన్నారు. ఆమె ఇంట్లో తనిఖీ చేయగా 105 గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు తెలిపారు. సదరు మహిళ ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు పెంచిందని, చెట్లు ఎవరికీ కనిపించకుండా చుట్టూ కట్టెలు పెట్టి ఉంచిందన్నారు. గంజాయి ఎండిన అనంతరం చిన్నచిన్న ప్యాకెట్లలో నింపి బస్సీ ప్రకాశ్ అనే వ్యక్తి ద్వారా అధిక ధరకు విక్రయిస్తోందని తెలిపారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.